మల్కాజిగిరి ఓట్ల లెక్కింపు ప్రశాంతం

- కౌంటింగ్‌ను పర్యవేక్షించిన కలెక్టర్, పోలీసు అధికారులు
- ప్రతీ రౌండ్‌లోనూ బీజేపీదే ఆధిక్యం

సాక్షి,మేడ్చల్ జిల్లా: కీసర మండలం భోగారం హోలీమేరీ ఇంజినీరింగ్ కళాశాలలో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు, సరూర్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో ఎల్బీనగర్, బేగంపేట వెస్లీ కాలేజీలో కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మూడంచెల భద్రతతో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. హోలీమేరీ కాలేజీలో మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేసి ఓట్ల లెక్కింపు నిర్వహించారు. ఇందులో 575 మంది సిబ్బంది విధులు నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రంలో బరిలో ఉన్న పార్టీల అభ్యర్థుల తరఫున ఏజెంట్లు హాజరుకాగా, ఒక టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ కౌంటింగ్ సూపర్‌వైజర్, మైక్రోఅబ్జర్వర్ విధులు నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మీడియా సెంటర్‌తో పాటు ఎప్పటికప్పుడు ఎన్నికల ఫలితాల సమాచారం కోసం ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. లెక్కింపు కేంద్రాలను తరచుగా జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్, పోలీసు అధికారులు పర్యవేక్షించగా, పలువురు డీసీపీలు, ఏసీపీలు, పదుల సంఖ్యలో సీఐ, ఎస్‌ఐలు, వందలాది పోలీసులు బందోబస్తు చేపట్టారు.

ఉత్కంఠ భరితంగా..

మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు ఆద్యాంతం ఉత్కంఠరితంగా సాగింది. మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, మల్కాజిగిరి, ఎల్బీనగర్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని లెక్కింపులో ప్రతీ రౌండ్‌లో మొదటి నుంచి బీజేపీ అధిక్యతను చాటింది. ఫలితం బీజేపీకి అనుకూలంగా ఉండడంతో ఆ పార్టీ అభ్యర్థులు, వారి ఏజెంట్లు గెలుపు ధీమాతో ఆనందాన్ని వ్యక్తం చేయగా, మిగితా పార్టీల ఏజెంట్లు మాత్రం కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోవడం కనిపించింది. ఓట్ల లెక్కింపు కొనసాగుతుండగానే.. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోగా, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ మాత్రం చివరి వరకు కౌంటింగ్ కేంద్రంలోనే ఓట్ల లెక్కింపును పర్యవేక్షించారు. కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి కూడా కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు సరళిని పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాన్ని ఎన్నికల నోడల్ అధికారులు పర్యవేక్షించారు. కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, అగ్నిమాపక వాహనంతో పాటు హాలులో టవరింగ్ ఏసీలు, భోజన వసతి, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించారు.

69,376 ఓట్ల ఆధిక్యత సాధించిన ఈటల

మేడ్చల్/పోచారం: కీసర మండలం భోగారంలోని హోలిమేరీ ఇంజినీరింగ్ కళాశాలలో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని మేడ్చల్ నియెజకవర్గ ఓట్ల లెక్కింపును మంగళవారం చేపట్టారు. అధికారులు టేబుళ్ల ఏర్పాటు చేసి 21 రౌండ్ల పాటు కౌంటింగ్ నిర్వహించారు. నియోజకవర్గంలో 6,65,979 మంది ఓటర్లుండగా 3,85,129 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ మేడ్చల్‌లో 1,86,819 ఓట్లతో మొదటి స్థానం సాధించారు. 1,17,443 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి రెండో స్థానం, 66,485 ఓట్లతో బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి మూడో స్థానంలో నిలిచారు. మొత్తంగా ఈటల 69,376 ఓట్ల ఆధిక్యతను సాధించారు.

ఈటల మెజార్టీ కంటే బీఆర్‌ఎస్ అభ్యర్థికి తక్కువ ఓట్లు..
ఈటల రాజేందర్‌కు 1,86219 ఓట్లు రాగా ఆయనకు 69,376 ఓట్ల మెజార్టీ లభించింది. అయితే బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి 66485 ఓట్లు మాత్రమే లభించగా ఈటల మెజార్టీ కంటే 2891 ఓట్లు తక్కువగా వచ్చాయి.

రౌండ్ల వారీగా ఎవరికెన్ని ఓట్లు..

రౌండ్	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	లీడ్
1	7790	7590	3747	200(బీజేపీ)
2	9577	5134	2715	4443 '
3	8841	5167	2428	3674 '
4	6873	5833	4225	1040 '
5	8980	6731	3305	2249
6	8357	5476	3279	2881
7	7561	6855	2641	706
8	10458	5817	2770	4641
9	10495	5101	2867	5394
10	8643	5514	3101	3129
11	7986	6396	3381	1590
12	7770	5252	2405	2518
13	8426	5829	3434	2597
14	10569	6770	3255	3799
15	12379	4318	3561	8061
16	11063	4942	3475	6121
17	11155	4331	2737	6824
18	9236	4632	2644	4694
19	9453	5584	3489	3869
20	6627	5309	3642	1318
21	4580	4862	3384	282(కాంగ్రెస్)
మొత్తం.	1,86,519	117443	66485	69376

సేవా కార్యక్రమాలు కొనసాగిస్తా

పోచారం: ఎన్నికల్లో ఓడిపోయినా సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌తో కలిసి కౌంటింగ్ సెంటర్ నుంచి మధ్యాహ్నమే వెళ్లిపోయారు. 18వ రౌండ్ ముగియగానే 3 లక్షల పైచిలుకు ఓట్ల ఆధిక్యంలో ఉన్న బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కూడా మాట్లాడారు. ఎనిమిది నియోజకవర్గాల్లో బీజేపీ విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. మిగిలిన నియోజకవర్గాల్లోనూ ప్రత్యర్థులకు గట్టిపోటీ ఇచ్చామని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

గీతామందిర్‌లో 'హరేరామ' నామ సప్తాహం



గీతామందిర్‌లో పారాయణం దృశ్యం

ఘట్‌కేసర్: పట్టణంలోని బాలాజీనగర్ గీతామందిర్‌లో శ్రీ మద్భగవద్గీత భక్త సమాజం సౌజన్యంతో మంగళవారం హరేరామా హరే కృష్ణ నామ సంకీర్తనా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సదానంద యోగీశ్వరులు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 2న ప్రారంభించిన హరేరామా హరే కృష్ణా సంకీర్తనా పారాయణం వరకు కొనసాగుతుందని శ్రీ మద్భగవద్గీత భక్త సమాజం సభ్యులు తెలిపారు.

మహేష్ భగవత్‌కు అభినందనలు

కుషాయిగూడ: తెలంగాణలో అత్యుత్తమ సేవలు అందించిన పోలీసు ఉన్నతాధికారి మహేష్ మురళీధర్ భగవత్‌కు గతంలో కేంద్రం రాష్ట్రపతి పోలీస్ మెడల్ ప్రకటించిన విషయం విధితమే. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహేష్ మురళీధర్ భగవత్ సదరు మెడల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో మంగళవారం ప్రముఖ న్యాయవాది సుంకర నరేష్, ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ అనిల్ కుమార్, మేకల నవీన్‌నాయుడు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



మహేష్ భగవత్‌కు అభినందనలు తెలుపుతున్న సుంకర నరేష్ తదితరులు

మేడ్చల్‌లో బీజేపీకే పట్టం

- పార్లమెంట్ ఎన్నికల్లో కమలం పార్టీని ఆదరించిన ఓటర్లు
- ఫలించిన ఈటల మంత్రాంగం
- రెండో స్థానంలో కాంగ్రెస్, మూడో స్థానంలో బీఆర్‌ఎస్

మేడ్చల్: పదేళ్లుగా ఏ ఎన్నికలైనా బీఆర్‌ఎస్‌కు పట్టం గట్టిన మేడ్చల్ నియోజకవర్గ ఓటర్లు ఈసారి అనూహ్యంగా బీజేపీని ఆదరించారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలోని మేడ్చల్ నియోజకవర్గంలో పార్లమెంట్, అసెంబ్లీకి మూడుసార్లు ఎన్నికలు నిర్వహించారు. ఇందులో పార్లమెంట్‌లో రెండు సార్లు కాంగ్రెస్, ఒకసారి బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మూడుసార్లు బీఆర్‌ఎస్ అభ్యర్థులే గెలుపొందారు.

గత పార్లమెంట్ ఎన్నికల్లో..
గత పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీగా సీఎం రేవంత్‌రెడ్డి గెలిచినా మేడ్చల్ ఓటర్లు మాత్రం బీఆర్‌ఎస్‌కు అండగా నిలిచారు. ఆ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 8087 ఓట్ల మెజార్టీ ఇచ్చారు. అప్పుడు బీజేపీ మూడో స్థానానికే పరిమితమయ్యింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మొదటి స్థానంలో, కాంగ్రెస్ రెండో స్థానంలో, బీజేపీ మూడో స్థానంలో నిలిచింది.

బీజేపీ ఆధిక్యత..
తాజా ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా పుంజుకున్నది. ఆ పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు తన పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. బలం ఉన్న, బలం లేని బూత్‌ల్లో సైతం ఆయనకే మెజార్టీ ఓట్లు లభించాయి. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల ఓటర్లు ఆదరించి ఓట్లు వేయడంతో సంపూర్ణ ఆధిక్యత లభించింది

పని చేయని నేతల ప్రభావం..
మొదటి రౌండ్ నుంచి బీజేపీ మొదటి, కాంగ్రెస్ రెండో స్థానంలో నిలవగా, బీఆర్‌ఎస్ మూడో స్థానానికే పరిమితమయ్యింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు స్థానిక ప్రజాప్రతినిధులు, బలమైన కేడర్ ఉన్నప్పటికీ అదంతా పార్టీ బలానికే సరిపోయాయి. ఓటర్లు మాత్రం జాతీయ భావాలు ముఖ్యమనే ఉద్దేశంతో బీజేపీకి పట్టం కట్టారు.

ఫలించిన ఈటల మంత్రాంగం..
మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్‌ను ముందుగానే ప్రకటించగా ఆయన కావాల్సినంత సమయం దొరికింది. తన అనుభవాన్ని ఉపయోగించుకుని రాజకీయం నడిపించారు.ఆయన నివాసం కూడా మేడ్చల్ నియోజకవర్గంలోనే ఉండడంతో ఇక్కడ విస్తృతంగా పర్యటించారు. బీఆర్‌ఎస్ నాయకులు, తటస్థ నాయకులు, గతంలో కీలకంగా ఉన్న నాయకుల ఇంటింటికీ వెళ్లాడు. పార్టీలో చేరాలని లేకుంటే తనకు మద్దతు ఇవ్వాలని కోరాడు. అలాగే కులాల వారీగా సమావేశాలు నిర్వహించి తన స్థాయిలో హామీలు ఇచ్చారు. ఎన్డీయే అనుకూల పవనాలు, ప్రధాని నరేంద్రమోదీ చరిష్మా, నియోజకవర్గంలో అత్యధికంగా ఉత్తర భారత ఓటర్లు ఉండడం, కాంగ్రెస్ గ్రూపు రాజకీయాలు ఇలా అన్ని ఆయనకు కలిసి రావడంతో ఈటల మేడ్చల్‌పై పట్టు సాధించారు.

సీటును నిలబెట్టుకోలేకపోయిన కాంగ్రెస్..
సీఎం రేవంత్‌రెడ్డి సిట్టింగ్ స్థానమైన మల్కాజిగిరి బీజేపీ కైవసం చేసుకోవడంతో కాంగ్రెస్‌కు గట్టి దెబ్బ తగిలినట్లయ్యింది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని మేడ్చల్ పరిధిలో ప్రచారం చేసినా కాంగ్రెస్ అభ్యర్థికి మెజార్టీ సాధించలేకపోయారు. నాయకులు ఐక్యంగా ఉండి పని చేయకపోవడం వల్లే తమకు మెజార్టీ రాలేదని ఆ పార్టీ నాయకులే చెబుతుండడం గమనార్హం. ప్రచారంలో సైతం అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి నాయకులు పని చేయకపోతే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని పలుమార్లు హెచ్చరించారు.

ఉప్పల్‌లో బీజేపీ ప్రభంజనం

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు అంచనాలకు మించి ఓట్లు పోలయ్యాయి. మొత్తం 21 రౌండ్లలో ఏ రౌండ్‌లోనూ మెజార్టీ తగ్గకుండా తిరుగులేని ఆధిక్యం సాధించారు. ఏకంగా తన సమీప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డిపై 3,86,258 ఓట్ల ఆధిక్యతతో ఘన విజయం సాధించారు. మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ స్పష్టమైన ఆధిక్యత ప్రదర్శించారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గానికి సంబందించిన మొత్తం ఓట్లు 5,40,052 ఉండగా 2,61,634 ఓట్లు పోలయ్యాయి. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో 21వ రౌండ్ ముగిసే సరికి ఉప్పల్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు వచ్చిన ఓట్లు 1,30,105, కాగా కాంగ్రెస్ అభ్యర్థి పట్నం మహేందర్‌రెడ్డికి 76,870, బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి 48,958 ఓట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఏదేమైనా మోదీ హవాతో మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో గెలుపొందారు.

- 2019లో మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో వివిధ పార్టీలకు ఉప్పల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో వచ్చిన ఓట్లు ఇలా ఉన్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి ఎనుముల రేవంత్‌రెడ్డికి 85,385, టీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డికి 77,501, బీజేపీ అభ్యర్థి రామ్‌చందర్ రావుకు 46,143 ఓట్లు సాధించుకున్నారు.
- పార్లమెంట్ ఎన్నికల్లో ఉప్పల్ అసెంబ్లీ నుంచి మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులకు వచ్చిన ఓట్లు రౌండ్ల వారిగా ఇలా ఉన్నాయి.

ఉచితంగా ఫిజియోథెరపీ చికిత్సలు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, వివేకానందనగర్ కాలనీలోని రిక్రియేషన్ క్లబ్‌లో ఫిజియోథెరపీ చికిత్స ఉచితంగా చేయనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఫ్యాప్సికో, జీహెచ్‌ఎంసీ, హెల్పేజ్ ఇండియా, రిక్రియేషన్ క్లబ్, ఎంపీసీఆర్, లయన్స్‌క్లబ్‌ల సంయుక్త సహకారంతో నిర్వహించే ఈ ఫిజియోథెరపీ సెంటర్‌లో ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు చికిత్స అందజేయనున్నట్లు తెలిపారు. మెడ, మోకాళు, ఒళ్లు, కాళ్లు, కీళ్ల నొప్పులు వంటి తదితర నొప్పులకు చికిత్స చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీదుర్గా జ్యోతిష్యాలయంలో పూజలు

గౌతంనగర్: మాసశివరాత్రిని పురస్కరించుకుని మంగళవారం గౌతంనగర్ డివిజన్ ఉత్తమ్‌నగర్‌లోని శ్రీదుర్గా జ్యోతిష్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రుద్రహోమం, శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు నిర్వాహకుడు నాగరాజు శర్మ తెలిపారు.

అగ్రికల్చర్ విద్యార్థిని అదృశ్యం



సంజన

ఘట్‌కేసర్: విద్యార్థిని అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ విజయపురి కాలనీకి చెందిన దాసోజు సందన (18) అవుషాపూర్ అనురాగ్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ మొదటి సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం 8 గంటలకు ఉప్పల్‌లో కళాశాల బస్సు ఎక్కి కాలేజీకి వెళ్లింది. తిరిగి సాయంత్రం 5 గంటలకు కళాశాల బస్సు ఎక్కింది. కానీ సంజన ఇంటికి రాకపోవడంతో ఆమె తల్లి కళాశాలకు వచ్చి విచారించగా బస్సులో ఇంటికి తిరిగి వెళ్లినట్లు గుర్తించారు. సంజనకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో విద్యార్థిని తల్లి భవానీ ఘట్‌కేసర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





నాగారం మున్సిపాలిటీలో నేతల సంబురాలు

బీజేపీ నాయకుల సంబురాలు

మేడ్చల్: మల్కాజిగిరి ఎంపీగా బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ విజయం సాధించడంతో మేడ్చల్ లో ఆ పార్టీ నాయకులు మంగళవారం సంబురాలు చేసుకున్నారు. పట్టణంలో పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే ఈటల నివాసానికి నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి సంబురాల్లో పాల్గొన్నారు.



సంబురాల్లో మేడ్చల్ నాయకులు

ఘట్‌కేసర్, ఎదులాబాద్‌లో..

ఘట్‌కేసర్: బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్, మండలాధ్యక్షుడు ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో ర్యాలీ తీసి పటాకులు కాల్చారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు రామతీర్థ, లక్ష్మారెడ్డి, సుభాషిణి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, రామోజీ, శశికాంత్‌రెడ్డి, కుమార్, మాజీ సర్పంచ్ మూసీ శంకరన్న, లక్ష్మణ్, శ్రీరాములు, రవిశంకర్ శ్రేణులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ, గ్రామాలు..

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ, నాగారం మున్సిపాలిటీతో పాటు, మండలంలోని వివిధ గ్రామాల్లో బీజేపీ నేతలు పటాకులు కాల్చారు. ఈ సందర్భంగా నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి బీజేపీకి భారీ విజయం అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు, కేంద్రం నుంచి అత్యధిక నిధులు మల్కాజిగిరి నియోజకవర్గానికి తీసుకువచ్చేందుకు ఈటల కృషిచేస్తారన్నారు. కీసర బీజేపీ మండలాధ్యక్షుడు దేశం మల్లేశ్‌గౌడ్, నాగారం మున్సిపల్ అధ్యక్షుడు బుద్ధవరం వేణుగోపాల్, దమ్మాయిగూడ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు మోర నాగమల్లారెడ్డి, నేతలు జిల్లాల తిరుమల్‌రెడ్డి, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, బోడ శ్రీనివాస్ కోలబాల్ రాజ్, సంపత్ యాదవ్, వంగేటి బాపిరెడ్డి, బండారి శ్రీనివాస్‌రెడ్డి, నల్ల వెంకట్‌రెడ్డి, లక్ష్మి, అశోక్ ముదిరాజ్, మెట్టుకృష్ణాయాదవ్, ఆంజనేయులు, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఎదులాబాద్‌లో ఈటల విజయోత్సవ ర్యాలీలో ప్రవీణ్‌రావు, శ్రీశైలం, శ్రేణులు



గుండ్లపోచంపల్లిలో సంబురాలు చేసుకుంటున్న నాయకులు



ఘట్‌కేసర్‌లో హనుమాన్, రామతీర్థ, సుభాషిణి..



లక్ష్మాపూర్ తండాలో నాయకుల సంబురాలు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందాడు. చర్లపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయినగర్ కాలనీకి చెందిన కాటిపల్లి పవన్ కుమార్‌రెడ్డి కుమారుడు వివేకానందరెడ్డి(16) విద్యార్థి. కుషాయిగూడకు చెందిన స్నేహితులు రిత్విక్, శివతో కలిసి బైక్‌పై చక్రిపురం నుంచి చిన్న చర్లపల్లికి వెళ్తున్నారు అతివేగం కారణంగా మోడీ అపార్ట్‌మెంట్స్ వద్ద ద్విచక్ర వాహనం స్కిడ్ కావడంతో రోడ్డుపై పడిపోయారు. దీంతో వివేకానందరెడ్డి ఎడమ కాలు, తొడ, వెన్నెముకకు తీవ్ర గాయాలయ్యాయి. ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ మహిళా నేతను పరామర్శించిన ఎమ్మెల్యే



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

రామంతాపూర్: లక్ష్మీనారాయణ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకురాలు లతారెడ్డి అనారోగ్యంతో మలక్‌పేట్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మంగళవారం ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి పిల్లల చదువుల విషయంతో పాటు ఆర్థికంగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. స్థానిక బీఆర్‌ఎస్ నేతలు పాయసం గోపాల్, అలెగ్జాండర్ సీహెచ్ రాములు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కుషాయిగూడ: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన లోక్ అదాలత్ వాల్ పోస్టర్‌ను మంగళవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా జడ్జి వి.బాలభాస్కర్‌రావు, సివిల్ జడ్జి డి.కిరణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి బాలభాస్కర్‌రావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకొని సమస్యలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లలో లోక్ అదాలత్ పోస్టర్‌ను ప్రదర్శించి, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొనేలా అవగాహన కల్పించాలని సుచించారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, డెవిడ్ రాజు తదితరులున్నారు.



లోక్ అదాలత్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తూ..

ఎట్టకేలకు స్పందించారు.. ప్రహరీని కూల్చారు!



సర్వే నం.4లో కట్టుకాలువపై వెలిసిన ప్రహరీని కూల్చివేసిన అధికారులు

సుభాష్‌నగర్: చెరువు కట్ట కాలువపై వెలసిన మరో నిర్మాణాన్ని అధికారులు తొలగించారు. తుమార్ చెరువు దిగువ భాగాన తూము నుంచి వెళ్లే కట్టు కాలువ కబ్జా విషయాన్ని మే 29న 'సాక్షి'వెలుగులోకి తీసుకొచ్చింది. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సోమవారం సర్వే నం.2లోని కొంత భాగాన్ని కూల్చివేసి వెళ్లిపోయారు. ఈ విషయమై మంగళవారం అధికారుల నిర్లక్ష్యాన్ని మరోసారి 'సాక్షి'వెలుగులోకి తీసుకురావడంతో మంగళవారం ఉదయం సర్వే నం.4లో వెలిసిన మరో ప్రహరీని తొలగించారు.